


మన
# భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

శుక్రవారం 31 జూలై 2026 | ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం | పేజీలు :- 3




# లిఫ్టుల రక్షణ రైతు బాధ్యత

భానుపురి /హుజూర్నగర్

వ్యవసాయానికి ప్రాణాధారమైన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్వహణ, భద్రతతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్ల దొంగతనాల నివారణే ధ్యేయంగా సూర్యాపేట జిల్లా పోలీసు యంత్రాంగం ముందడుగు వేసింది. హుజూర్ నగర్, కోదాడ నియోజకవర్గాల పరిధిలోని రైతులు, ఇరిగేషన్, విద్యుత్, వ్యవసాయ అధికారులతో కలిసి హుజూర్ నగర్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

**రైతు కమిటీలు వేసి పర్యవేక్షించాలి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన లిఫ్ట్ ఇరిగేషన్లలో ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు, వైర్లు, ఆయిల్ దొంగతనానికి గురైతే చివరకు తీవ్రంగా నష్టపోయేది రైతాంగమేనని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆవేదన వ్యక్తం చేశారు. దొంగతనాలు జరిగాక పోలీసులు ఇతర రాష్ట్రాలకు వెళ్లి నిందితులను పట్టుకొని సొత్తు రికవరీ చేస్తున్నారని, అయితే దొంగతనాలు జరగకుండా ముందస్తుగా అడ్డుకోవడమే ముఖ్యమని స్పష్టం చేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ప్రతి లిఫ్ట్ పరిధిలో రైతులు సహకార సొసైటీలు, కమిటీలుగా ఏర్పడి నిరంతరం పర్యవేక్షించుకోవాలని సూచించారు. రైతుల కమిటీల ఏర్పాటు అంశాన్ని ప్రభుత్వం, ఇరిగేషన్ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. లిఫ్టుల వద్ద తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశమున్నందున, రైతులు నీటిని ఆదా చేస్తూ తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు.దేశానికి వెన్నుముక అయిన రైతన్నలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎస్పీ నరసింహ స్పష్టం చేశారు. నివాస ప్రాంతాలకు దూరంగా ఉన్న లిఫ్ట్ పథకాలనే లక్ష్యంగా చేసుకుని దొంగలు వైర్లు, ఆయిల్, ట్రాన్స్‌ఫార్మర్లు ఎత్తుకెళ్తున్నారని తెలిపారు. రైతుల మధ్య ఐకమత్యం, సామాజిక బాధ్యత పెరిగినప్పుడే దొంగతనాలకు చెక్ పెట్టవచ్చన్నారు. పోలీసు శాఖ తరఫున లిఫ్టుల వద్ద పాయింట్ బుక్స్ ఏర్పాటు చేసి, నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. దొంగతనాల నిర్మూలనలో రైతులు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు.

**లిఫ్టులను సొంత ఆస్తిగా భావించాలి: ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి**

ప్రభుత్వం రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి కోసం ఏర్పాటు చేస్తున్న లిఫ్ట్ ఇరిగేషన్లను రైతులు తమ సొంత ఆస్తిగా భావించి రక్షించుకోవాలని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి కోరారు.



లిఫ్టులలో దొంగతనాలు జరిగితే సాగునీరు అందక రైతులే నష్టపోతారని అన్నారు.వ్యవసాయ రంగానికి నిరంతర నీరందించేందుకు ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అనుక్షణం కృషి చేస్తున్నారని తెలిపారు. రైతుల ప్రయోజనాల కోసం, దొంగతనాల నివారణే ధ్యేయంగా ఇన్ని శాఖలను ఒకే వేదికపైకి తెచ్చి భారీ అవగాహన సదస్సు నిర్వహించిన జిల్లా పోలీసు యంత్రాంగాన్ని, ఎస్పీ నరసింహను ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి సూర్య నారాయణ, ఇరిగేషన్ సిఇ నాగభూషణం, విద్యుత్ డిఇ రామ్మోహన్ రెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్, తహసిల్దార్ కవిత ఇరిగేషన్, వ్యవసాయ శాఖల అధికారులు, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, రెండు నియోజకవర్గాల పరిధిలోని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజకీయంగా ఎదుర్కోలేక అక్రమ కేసులు పెడుతున్నారు

భానుపురి/సూర్యాపేట టౌన్

టిఆర్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,వజ్ర ఇండస్ట్రీస్ యజమాని వట్టే జానయ్య యాదవ్ ను రాజకీయంగా ఎదుర్కోలేక అక్రమ కేసులు పెడుతున్నారనిటీఆర్పీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ నీరజ గౌడ్ ఆరోపించారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో టీఆర్పీ పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వజ్ర ఇండస్ట్రీస్ కేసులో కోర్టు బెయిల్ మంజూరు చేసిన వెంటనే మరో ఎఫ్ఐఆర్ నమోదు చేయడం వెనుక రాజకీయ ఎజెండా ఉందన్నారు. సంబంధం లేని వ్యక్తులను కూడా పోలీస్ స్టేషన్లకు తీసుకెళ్లి ఇబ్బందులకు గురి చేశారని విమర్శించారు. జేబీ మిల్లుకు సంబంధించిన అంశంలో కూడా వాస్తవాలను పక్కనబెట్టి అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని, బీసీ నాయకుడిగా ఎదుగుతున్న ఒట్టే జానయ్యను రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.తెలంగాణలో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన భారీ ధాన్యం కుంభకోణాలపై దృష్టి పెట్టకుండా చిన్న వ్యాపారులను లక్ష్యంగా చేసుకోవడం సరైంది కాదన్నారు. పెద్దఎత్తున జరిగిన అవినీతి, కుంభకోణాలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బీసీలు వ్యాపారాలు చేయకూడదా, రాజకీయాల్లో ఎదగకూడదా అని



ప్రశ్నించిన ఆమె, రాజ్యాంగం ప్రతి పౌరుడికి రాజకీయంగా ఎదిగే హక్కు కల్పించిందన్నారు. అధికార యంత్రాంగాన్ని ఉపయోగించి బీసీలను అణచివేసే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తామని చెప్పారు. బీసీలపై ఎన్ని అక్రమ కేసులు నమోదు చేసినా వెనక్కి తగ్గేది లేదని, తెలంగాణలోని బీసీ సమాజం తమ హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఒట్టే జానయ్యకు టీఆర్పీ పార్టీ, బీసీ సంఘాలు అండగా నిలుస్తాయని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నవారు రాజకీయంగా ఎదుర్కోలేక తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని, ఇలాంటి చర్యలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. బీసీలపై జరుగుతున్న అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మామిడి అంజయ్య, పట్టణ అధ్యక్షుడు కుంభం నాగ రాజు, పెన్పహాడ్ మండల అధ్యక్షుడు ఆవుల అంజయ్య, ఆత్మకూర్ ఎస్ అధ్యక్షుడు బోల్లె సైదులు, సూర్యాపేట మండల అధ్యక్షుడు సోమగాని లింగ స్వామి, వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు చట్టసభలలో 33% రిజర్వేషన్ల అమలు కోసం పోరాడుదాం

భానుపురి/సూర్యాపేట టౌన్

చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు పట్ల పాలకవర్గాల ద్వంద్వ వైఖరిని ఖండిస్తూ, మహిళలకు చట్టసభలలో 33% రిజర్వేషన్ల అమలుకై పోరాడి సాధించకుందామని ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చల్లగుండ్ల శిరోమణి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ విక్రం భవన్ లో పిఓడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు మారసాని చంద్రకళ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భముగా ఆమె మాట్లాడుతూ మహిళలకు చట్టసభలలో 33% రిజర్వేషన్ కల్పించాలి అనే దానిపై పాలక పార్టీలు ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నాయని ఆమె అన్నారు. పాలకవర్గాల ఈ ద్వంద నీతి వలననే నేటికీ చట్టసభలలో 33% రిజర్వేషన్ అమలు కాకుండా పోయినదని ఆమె ఆవేదన చెందారు. కాంగ్రెస్ తో సహా,మతోన్మాదాన్ని పెంచి పోషించే బిజెపి వరకు అన్ని పాలకవర్గ పార్టీలు మనువాదాన్ని బలపరుస్తూ, మహిళలను రెండవ శ్రేణి పౌరులుగానే గుర్తిస్తున్నారని మహిళలకు రిజర్వేషన్ కల్పించడం వాళ్లకు ఏ




మాత్రం ఇష్టం లేదని అన్నారు. నిజంగా మహిళా సాధికార పట్ల ఈ పాలకవర్గ పార్టీలకు ప్రేమ ఉంటే డీలిమిటేషన్ బిల్లుతో సహా ఎలాంటి షరతులు విధించకుండానే పార్లమెంటులో 33% రిజర్వేషన్ బిల్లుపై ఆమోదం తెలపాలని ఆమె అన్నారు. ఇప్పటి వరకు అన్ని రకాల పాలకవర్గ పార్టీలు మహిళా బిల్లును తమ స్వార్థ రాజకీయాల కోసం ఉపయోగించుకుంటున్నందు వలనే ఈ మాట అనాల్సి వస్తుందని ఆమె చెప్పారు. చట్టసభలలో 33 శాతం ప్రాతినిధ్యం మహిళల హక్కు అని, అది బిక్ష కాదని, ఆ హక్కుని కొట్లాడి సాధించుకుంటామని, మహిళా బిల్లును అడ్డుకునే వారిని ప్రజలలో ఎండగడతామని ఆమె హెచ్చరించారు. మహిళలతో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్మించి మహిళా రిజర్వేషన్ బిల్లును సాధించుకుందామని ఆమె మహిళా లోకానికి పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.




# మున్సిపాలిటీ అభివృద్ధికి కట్టుబడి వున్నాము

**-సిఎం రేవంత్ రెడ్డి ని కలిసి నిధులు కేటాయించ వలసిందిగా కోరతాము**

భానుపురి/సూర్యాపేట ప్రతినిధి



సూర్యాపేట పట్టణ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలుస్తామని తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి తో కలిసి సిఎం రేవంత్ రెడ్డిని కలిసి సూర్యాపేట అభివృద్ధి కోసం వంద కోట్ల రూపాయలు కేటాయించవలసిందిగా కోరుతామని వారు అన్నారు. పట్టణ సమగ్ర అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. స్థానిక 26 వార్డులో ఐదు లక్షల రూపాయల వ్యయంతో నిర్మాణం చేపట్టనున్న సిసి డ్రైన్ కు గురువారం శంకుస్థాపన చేశారుమ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వార్డులో కూడా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వెలుగు వెంకన్న, వార్డు కౌన్సిలర్ పాలగాని మాధవి కృష్ణ, పిల్లల రమేష్ నాయుడు, డి ఇ ప్రణయ్ రెడ్డి, నాయకులు వల్దాసు దేవేందర్, తండు శ్రీనివాస్, దండ అరవింద రెడ్డి, యాట ఉపేందర్, కోడి కృష్ణ, వరుణ్, వార్డు జవాను శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు

# ఏఐటీయూసీ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

భానుపురి/సూర్యాపేట టౌన్



ఆగస్టు ఒకటో తేదీన సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరుగుతునున్న ఎఐటియుసి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.రాజారామ్ విజయవంతం చేయాలని అన్నారు. నేడు తుంగతుర్తి నియోజకవర్గంలో కార్మికులకు దగ్గరకు వెళ్లి జయప్రదం చేయాలని కోరుతూ ఆయన మాట్లాడుతూ ఏఐటీయూసీ జిల్లా మూడో మహాసభలను మహాసభల్లో కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పైన చర్చించి భవిష్యత్తు పోరాట కార్యక్రమం రూపొందించుకోవడం కోసం దోహదపడతాయని కార్మిక వ్యతిరేక విధానాల అవలంబిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపైన పోరాటాలకు సన్నద్ధం చేయడం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి గౌరవ అధ్యక్షులు కోటా రామస్వామి మాట్లాడుతూ తుంగతుర్తి నియోజకవర్గం నుండి అధిక సంఖ్యలో తల్లి వెళ్లి జయప్రదానికి కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మనోజ్ తడకమల సైదులు సాలయ్య వీరబోయిన కృష్ణ కసర్బోయిన బిక్షం నజీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఒబీసీ 11వ జాతీయ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



భానుపురి/సూర్యాపేట టౌన్

బీసీలంతా ఏకమై మేమెంతో మాకు అంతానే డిమాండ్ తో ముందుకెళ్లాలని ఐక్యతతో పోరాటాలు చేసి మనకు రావాల్సిన వాటాను మన హక్కులను మన సంక్షేమాన్ని సాధించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చలమల్ల నర్సింహ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఓబీసీ జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆగస్టు ఏడో తారీఖున బెంగళూరు పట్టణంలో జరిగే ఓబిసి 11వ మహాసభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చలమల్ల నర్సింహ మాట్లాడుతూ ఆగస్టు ఏడో తారీఖున బెంగళూరు పట్టణంలో జాతీయస్థాయిలో ఓబిసి జాతీయ 11వ మహాసభ నిర్వ హించడం జరుగుతుందని, దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి బీసీ ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేలు ఎంపీలు ముఖ్యమంత్రులు రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని పార్టీల బీసీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొంటారని తెలిపారు. ఈ సభలో జనాభాలో 50% ఉన్న బీసీలకు చట్టసభలలో రాజకీయ రిజర్వేషన్లు 50 శాతం కల్పించాలని, పార్లమెంటులో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటునెబ బిల్లు పెట్టాలని, కేంద్రం చట్టసభలలో మహిళలకు ఇచ్చే 33% రిజర్వేషన్ లలో బీసీ మహిళలకు కూడా 50% రిజర్వేషన్ కల్పించాలని తదితర అంశాలను తీర్మానించి చర్చించడం జరుగుతుందని చెప్పారు. 80 సంవత్సరాల స్వాతంత్రంలో బీసీల ఓట్లను వేసుకొని అధి కారంలోకి వచ్చిన తర్వాత బీసీ ఉక్కు పాదంతో అసి వేస్తున్నారని, బీసీలను ఓట్లు వేసే యంత్రాల్లాగానే ఉప యోగించు కుంటున్నారని, అన్నారు. బీసీలంతా పెద్ద ఎత్తున ఈమహాసభకు తరలి వెళ్లి ఐక్యతను చాటి ప్రభుత్వాలు దిగి వచ్చే విధంగా సభను విజయవంతం చేసుకోవాలని , సూర్యా పేట జిల్లా నుండి కూడా పెద్ద ఎత్తున బిసి అన్ని వర్గాల ప్రజ లు తరలిరావాలని కోరారు.

# గుడిసెలు లేని రాష్ట్రమే లక్ష్యం



భానుపురి /సూర్యాపేట టౌన్

అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను పంపిణీ చేస్తూ గుడిసెలు లేని తెలంగాణ రాష్ట్రమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఏఐసీసీ సభ్యుడు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సర్ ప్రక్రియ పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వికలాంగ కార్పొరేషన్ చైర్మన్ వీరయ్యతో కలిసి వారు పాల్గొని మాట్లాడారు. దేశంలోని అన్ని రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణలో సర్ పేరుతో బిజెపి కుట్రలు చేసే అవకాశం ఉందని ప్రతి కార్యకర్త నాయకుడు సర్ ప్రక్రియను విజయవంతం చేయడంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. పార్టీలకతీతంగా ఏ పార్టీ వ్యక్తి అయిన తన ఓటును పోగొట్టుకోవద్దని ఉద్దేశంతో కాంగ్రెస్ నాయకులు అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరికి సర్ ప్రక్రియను పూర్తి చేపిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరుల ఓట్లను తీసివేసేలా బిజెపి కుట్రలు చేస్తుందని కార్యకర్తలు నాయకులు నిత్యం ప్రజల్లో ఉండాలన్నారు. సూర్యాపేటకాంగ్రెస్ కంచుకోటని ఎన్నికలు ఏవచ్చిన కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. సర్ ప్రక్రియలో ఏ ఒక్క ఓటు కూడా గల్లంత కాకుండా చూడాలన్నారు. బిఎల్ఓ లు సూపర్వైజర్లు విజయవంతమైన పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ మురిసెట్టి నివేదిత లక్షాధి, డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్లు, మండల అధ్యక్షులు, తూ ముల సురేష్ రావు, కోతి గోపాల్ రెడ్డి, ముసుకు రామచంద్రారెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులకు అండగా రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ



భానుపురి /చెరువుగట్టు

పేద ఆర్యవైశ్యులకు తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అండగా ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం నార్కట్పల్లి మండలం చెరువుగట్టు శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలోని దుకాణాలు, ఇళ్లు పూర్తిగా దగ్ధమై తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న ఆర్యవైశ్య (రెండు) కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ తరపున స్వయంగా ఆయన ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు.బాధితులైన రంగా శ్రవణ్ కుమార్ లక్ష రూపాయలు మరొక బాధితుడు కర్నాటి ఎల్లయ్య కు ఒక లక్ష మొత్తము 2 లక్షల రూపాయల చెక్కులను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

# సూర్యాపేట లో ఒక ప్రైవేట్ హాస్పిటల్ లో ఠాగూర్ సినిమా రిపీట్



భానుపురి/సూర్యాపేట టౌన్

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో ఠాగూర్ సినిమా రిపీట్ అయింది. నకిరేకల్ గ్రామానికి చెందిన పగిడిమర్రి మధుసూదన శర్మ కళ్ళు తిరుగుతున్నాయని తెలపడంతో కుమార్తె శ్రీవల్లి మంగళవారం ఆసుపత్రికి తీసుకొని వచ్చింది ఆయనను పరిశీలించిన వైద్యులు స్టంట్ లు వేయాలని చెబుతూ ఆరోగ్యశ్రీకి దరఖాస్తు చేసుకోవాలని చెప్పగా కుటుంబ సభ్యులు ఆరోగ్యశ్రీ కి దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం బుధవారం ఒక స్టంట్ వేయగా రోగి సహకరించకపోవడంతో తిరిగి మరో స్టంట్ ను కూడా వేయడం జరిగింది. బుధవారం మూడున్నర గంటల సమయంలో రోగి చనిపోతే కనీసం కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఆసుపత్రి ఆంబులెన్స్ లో నకిరేకల్ పంపించడం జరిగింది. దీంతో కుటుంబ సభ్యులు గురువారం ఎస్వీఆర్ ఆసుపత్రి ముందు ఆందోళన నిర్వహించారు. మా నాన్న మధ్యాహ్నం మూడున్నర గంటలకే చనిపోతే 5 గంటల వరకు మాకు చెప్పకుండా ఆ మందులు ఈ మందులు అంటూ తెప్పించారని అన్నారు. కాగా తమకు చనిపోయిన విషయాన్ని చెప్పకుండా తాము ఆసుపత్రిలో కట్టిన 80వేల రూపాయలు ఇచ్చి పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు కిడ్నీ ఆసుపత్రిలో గుండె ఆపరేషన్లు ఎలా చేస్తారని మా నాన్నకు ఆపరేషన్ చేసిన వైద్యురాలు లక్ష్మి శాలిని పేరు బోర్డుపై ఎక్కడ కూడా లేదన్నారు. మా నాన్న ప్రాణాన్ని తిరిగి ఇవ్వాలని లేదా మాకు నష్టపరిహారం చెల్లించాలని ఉన్నత అధికారులు స్పందించి ఆసుపత్రిని మూసివేయించాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి





భానుపురి/సూర్యాపేట కలెక్టరేట్

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి భారీ వర్షాలు, వరద పరిస్థితులపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అతి భారీ నుంచి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ అవసరమైన సహాయక చర్యలను వెంటనే చేపట్టాలని ఆదేశిం చారు.అధికారులందరూ తమ తమ ప్రధాన కార్యా లయాల్లో అందుబాటులో ఉండాలని, అన్ని జిల్లాల్లో 24 గంటల పాటు కంట్రోల్ రూమ్‌లు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాల్లో నమోదైన వర్షపాతం, జలాశయాల్లో నీటి నిల్వలు, దెబ్బతిన్న రహదారులు, వంతెనలు, చేపట్టిన సహాయక చర్యలపై జిల్లా యంత్రాంగాన్ని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొంటూ, ఎక్కడైనా ప్రజలకు ఇబ్బందులు ఎదురైనట్లు సమా చారం అందితే వెంటనే స్పందించాలని ఆదేశిం చారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు టామ్‌టామ్ నిర్వహించాలని సూచిం చారు. పారిశుద్ధ్య పనులను నిరంతరం కొనసా గించాలని, వైద్యారోగ్య శాఖ అధికారులు అత్యవసర సేవలకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు, చెరువులు, కుంటలు, నదుల పరిసర ప్రాంతాలకు ప్రజలు, పశుకాపరులు, మత్స్యకారులు వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, భారీ వర్షా లు, వరదల నేపథ్య ంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు శాఖ అన్ని శాఖలతో సమన్వయంగా పనిచే స్తోందని తెలిపారు. అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని పేర్కొన్నా రు. వీడియో కాన్ఫరెన్స్ లో ఇంచార్జి జిల్లా కలెక్టర్ బి. హరిసింగ్, జిల్లా రెవిన్యూ అధికారి ప్రేమ్ రాజ్, రెవెన్యూ డివిజనల్ అధికారి వేణు మాధవ్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, జిల్లా ప్రణాళిక అధికారి కిషన్, జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి, జిల్లా మత్స్యశాఖ అధికారి ఆంజనేయస్వామి, జిల్లా హార్టికల్చర్ అధికారి నాగయ్య, డిసిహెచ్ఎస్ అధికారి చంద్ర శేఖర్, జిల్లా ఫైర్ అధికారి కృష్ణ రెడ్డి ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అవకాశాలను విజయాలుగా మలచుకోవాలి



భానుపురి /సూర్యాపేట

ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనేది ప్రతి ఒక్కరి కల అని, అందులోనూ సమాజ భద్రతలో భాగస్వామ్యమయ్యే పోలీస్ ఉద్యోగం అత్యంత బాధ్యతాయుతమైనదని, సమాజానికి సేవ చేయడానికి పోలీసు ఉద్యోగం మంచి వారధి అని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు. ప్రభుత్వం పోలీస్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిందని, త్వరలోనే ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కానుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఉద్యోగాలకు సిద్ధమయ్యే నిరుద్యోగ యువతీ యువకులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన ఒక ప్రకటనలో సూర్యాపేట జిల్లా ఎస్పి పిలుపునిచ్చారు. సమగ్రమైన అవగాహన, పక్కా ప్రణాళికతో సాధన చేస్తే ప్రభుత్వ ఉద్యోగం సులువుగా సాధించవచ్చని ఎస్పీ పేర్కొన్నారు. అభ్యర్థులు ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసుకుని, లభించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవకాశాలను విజాయాలుగా మలచుకోవాలి అన్నారు. అర్హులైన అభ్యర్థుల కోసం జిల్లా యంత్రాంగం సహకారంతో, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో త్వరలోనే ముందస్తు ఉచిత శిక్షణ అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.నిరుద్యోగ యువత సమయాన్ని వృథా చేయకుండా ఉద్యోగ సాధనకు సిద్ధం కావాలని, ప్రామాణికమైన పుస్తకాలను ఎంచుకోవాలని ఎస్పీ సూచించారు. సబ్జెక్టుపై పట్టు సాధించేందుకు అవసరమైన వారు శిక్షణ తీసుకోవాలని కోరారు. పోలీస్ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న యువతీ యువకులకు సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ తరపున ఆయన ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తాం అని ఎవరైనా చెపితే ఎలాంటి వారి మాటలు నమ్మి ఎవ్వరికీ డబ్బులు ఇవ్వవద్దని కోరారు.

# సంతకాల సేకరణలో 10 వేల మైలురాయి

# ఢిల్లీ దిశగా రైల్వే సాధన సమితి అడుగులు

భానుపురి /సూర్యాపేట టౌన్

సూర్యాపేటకు రైల్వే మార్గం సాధించాలనే లక్ష్యంతో సాగుతున్న ఉద్యమంలో మరో కీలక మైలురాయిగా రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సుడిగాలి పర్యటన ఘనవిజయం సాధించింది. విద్యార్థులు, విద్యాసంస్థల యాజమాన్యాన్ని చైతన్యపరుస్తూ నిర్వహించిన సంతకాల సేకరణ కార్యక్రమం విజయవంతంగా పూర్తికాగా, మొత్తం 10 వేల సంతకాల లక్ష్యాన్ని చేరుకోవడం ఉద్యమానికి కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఉదయం నవోదయ పాఠశాల నుంచి ప్రారంభమైన ఈ పర్యటన అనంతరం సిటీ టాలెంట్ స్కూల్, త్రివేణి స్కూల్, కాకతీయ స్కూల్, నారాయణ కళాశాల, సృజన స్కూల్‌లను సందర్శించింది. మధ్యాహ్నం సాహితీ స్కూల్, ఎంఎస్ఆర్ స్కూల్, మోడల్ స్కూల్‌లలో విద్యార్థులు, ఉపాధ్యాయులను కలిసి సూర్యాపేటకు రైల్వే మార్గం అవసరాన్ని వివరించారు. ఉద్యమానికి మద్దతుగా విద్యార్థులు పెద్ద ఎత్తున సంతకాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యాసంస్థల కరస్పాండెంట్లు మారం లింగారెడ్డి, ప్రకాష్ రెడ్డి, హరి, కొల్లు శ్రీనివాస్, ఉపేందర్ రావు తదితరులు రైల్వే ఉద్యమానికి తమ పూర్తి మద్దతు ప్రకటించారు. ప్రజా ప్రయోజనాల కోసం సాగుతున్న ఈ ఉద్యమంలో తాము కూడా భాగస్వాములవుతామని హామీ ఇచ్చారు. 10 వేల సంతకాల సేకరణ పూర్తికావడంతో రైల్వే సాధన సమితి సభ్యుల్లో





ఆనందం వెల్లివిరిసింది. ప్రజల నుంచి లభిస్తున్న అపూర్వ స్పందన ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తోందని నాయకులు పేర్కొన్నారు. ఉద్యమాన్ని తదుపరి దశకు తీసుకెళ్లేందుకు రైల్వే సాధన సమితి ఇప్పటికే కార్యాచరణను ప్రారంభించింది. త్వరలోనే ఒక ప్రతినిధి బృందాన్ని న్యూఢిల్లీకి పంపి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి, సూర్యాపేట రైల్వే ప్రాజెక్టు అవసరాన్ని వివరించి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించింది. అదే సమయంలో సూర్యాపేటలో ప్రజలను మరింత చైతన్యపరిచే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. మొదటి దశలో భారీ మానవహారం నిర్వహించి రైల్వే కోసం ప్రజల ఆకాంక్షను దేశ దృష్టికి తీసుకెళ్లాలని సమితి నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో రైల్వే సాధన సమితి కన్వీనర్ దేగల జనార్ధన్, కో–కన్వీనర్ రాచూరి ప్రతాప్, ఉద్యమ కోఆర్డినేటర్ బిక్కుమల్ల ఉపేందర్, సభ్యులు నల్లపాటి అప్పారావు, కె. మంజుల, మారోజు కృష్ణమూర్తి, అక్కినేపల్లి రాము, పోతరాజు నరసయ్య తదితరులు పాల్గొని వివిధ విద్యాసంస్థలను సందర్శిస్తూ ఉద్యమానికి మద్దతు కూడగట్టారు. "10 వేల సంతకాలు కేవలం సంఖ్య కాదు.. సూర్యాపేట ప్రజల రైల్వే ఆకాంక్షకు నిదర్శనం. ప్రజల సహకారంతో ఉద్యమాన్ని ఢిల్లీ వరకు తీసుకెళ్లి సూర్యాపేటకు రైల్వే సాధించే వరకు పోరాటం కొనసాగుతుంది" అని రైల్వే సాధన సమితి నాయకులు స్పష్టం చేశారు.

# శ్రీ వాసవి సేవా సమితి పదవ వార్షికోత్సవ సందర్భంగా పలువురికి ఆహ్వానం







భానుపురి/ హైదరాబాద్

ఆగస్టు 6 న గురువారం రోజున శ్రీ వాసవి సేవా సమితి పదవ వార్షికోత్సవం సందర్భంగా గురువారం హైదరాబాదులోని ప్రముఖులను శ్రీ వాసవి సేవా సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ పూరి సురేష్ శెట్టి మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాదు రవీంద్ర భారతిలో శ్రీ వాసవి సేవా సమితి పదవ వార్షికోత్సవానికి ఆహ్వానించడం జరిగినదనీ ఈ కార్యక్రమానికి ఖచ్చితంగా హాజరవుతామని ఎమ్మెల్సీ బొగ్గరం దయానంద గుప్తా, సినీ ఆర్టిస్టు శ్రీ వాసవి సేవాసమితి జాతీయ సభ్యులు పసునూరి శ్రీనివాస్, రిటైర్డ్ జిల్లా జడ్జి సుప్రీంకోర్టు న్యాయవాది శ్రీ వాసవి సేవాసమితి జాతీయ లీగల్ అడ్వైజర్ నేరెళ్ల మాల్యాద్రి లు తెలిపినట్లు వారు అన్నారు. వీరి వెంట తెలంగాణ రాష్ట్ర శ్రీ వాసవి సేవా సమితి మహిళా అధ్యక్షురాలు జయశ్రీ, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ సామ శ్రీధర్ జోగులాంబ గద్వాల జిల్లా శ్రీ వాసవి సేవా సమితి కోశాధికారి చల్లా ప్రకాష్ తదితరులు ఉన్నారు.

# సర్ ప్రక్రియలో బాధ్యతతో పనిచేయాలి

-ప్రభుత్వ విప్, నల్గొండ పార్లమెంట్ సర్ ఇన్చార్జి

బల్మూరి వెంకట్

భానుపురి/ నల్గొండ :

రానున్న మూడు రోజుల్లో సర్ ప్రక్రియను పూర్తి చేయుటకు ప్రతి ఒక్క కార్యకర్త బాధ్యతతో పనిచేసి మిర్యాలగూడ నియోజకవర్గాన్ని తెలంగాణ రాష్ట్రంలోనే ముందంజలో ఉంచాలని ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్, నల్గొండ పార్లమెంట్ సర్ ఇన్చార్జ్ బల్మూరి వెంకట్ శ్రీనివాస్ కోరారు. గురువారం మిర్యాలగూడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంపై కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏ) లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా విచ్చేసిన ఆయన వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, మిర్యాలగూడ నియోజకవర్గ సర్ ఇన్‌చార్జి షబ్బీర్ అలీ, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పున్నా కైలాష్ నేత లతో కలిసి పాల్గొనీ మాట్లాడారు. ఎన్నికల కమిషన్ సర్ ప్రక్రియకు నిర్దేశించిన గడువు ఆగస్ట్ 3 తో ముగియనున్న నేపథ్యంలో... మిగిలిన మూడు రోజులు ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేసి... మిర్యాలగూడ నియోజకవర్గంలో ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో సర్ ప్రక్రియపై అత్యధిక సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ, నిత్యం క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేస్తున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని అభినందించారు.



మిర్యాలగూడ నియోజకవర్గంలో ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చి నివసిస్తున్న ఓటర్ల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ, ఇప్పటికే సర్ ప్రక్రియ లో 86 శాతం నమోదు పూర్తి చేసి జిల్లాలో అగ్రస్థానంలో కొనసాగుతున్నామని తెలిపారు.



మిగిలిన అర్హులైన ప్రతి ఓటర్ ని గుర్తించి, గడువు ముగిసేలోపు వంద శాతం ప్రక్రియ పూర్తి చేసే దిశగా అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, సర్పంచ్ లు, ఇంచార్జులు, బీఎల్ఏ లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.